

స్వేచ్ఛగా బతుకునిద్దాం

ప్రకృతి ప్రసాదాలైన వన్యప్రాణులను వాటికి కేటాయించిన స్థలంలో ఉండనిద్దాం. వాటి రక్షణకు పాటుపడదాం. అడవిలో సేదతీరే వాటిని స్వేచ్ఛగా బతుకనిద్దాం. 8లో ▸



కంప్యూటేషనల్ గణితంపై వర్క్‌షాప్

బాసర ఆర్జీయూకేటీలో కంప్యూటేషనల్ మ్యాథమెటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. అధ్యాపకులు వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతం తగ్గనుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిధులు మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

బోథ్: నియోజకవర్గంలోని గిరిజన పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ గురువారం హైదరాబాద్‌లో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రెండో విడతలో మరిన్ని బీటీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

సైఫ్‌ను ఉరి తీయాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కైలాస్‌నగర్: వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు బాధ్యుడైన సైఫ్‌ను ఉరి తీయాలని షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం, గోర్ సేనా నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిందితుడిని ఉరి తీయాలని, కేఎంసీ హెచ్‌వోడీ, ప్రిన్సిపాల్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

పెట్రోల్‌బంక్ నిర్మాణ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నటరాజ్

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ శివారులో పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం అదనపు కలెక్టర్ నటరాజ్ తహసీల్దార్ పవన్‌చంద్రతో కలిసి గురువారం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి భూముల సమస్యలు తెలుసుకున్నారు. లంబాడాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్, నాయకులు రాథోడ్ కమల్‌సింగ్, రమేశ్ తదితరులు అదనపు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెట్రోల్‌బంక్‌ను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ఐ నాగోరావు, సర్వేయర్ శంకర్ ఉన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇతర పనులు అప్పగించవద్దని కోరారు. కేంద్రం బడ్జెట్‌లో కోత విధించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2018లో పోరాటాల ద్వారా వేతనాలు పెంచుకున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన వేతనాలు వెంటనే చెల్లించకుండా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంఘం బాధ్యులు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా భర్తీ చేయనున్న సపోర్ట్ ఇంజినీర్ ఉద్యోగానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతోపాటు పూర్తి వివరాలను కార్యాలయ నోటీస్ బోర్డు లేదా http://adilabad.telangana.gov.in లో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 3నుంచి 6వ తేదీ సాయంత్రం 5గంటల వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సమీకృతానికి ముందడుగు



కలెక్టరేట్ భవన నిర్మాణ స్థలం

- కొలిక్కివచ్చిన రెండెకరాల సేకరణ
- నిర్వాసితులకు పరిహారం లేదా భూమి
- అంగీకరించిన అసైన్డ్ హక్కుదారులు
- ఆర్‌అండ్‌బీ ద్వారా టెండర్ ప్రక్రియ పూర్తి
- హైదరాబాద్ కంపెనీకి పనులు అప్పగింత
- త్వరలో భవన నిర్మాణం ప్రారంభం

సమీకృత కలెక్టరేట్ వివరాలు
నిర్మాణ స్థలం: మావల మండలం బట్టిసావర్గాం
విస్తీర్ణం: 26 ఎకరాలు (అదనంగా మరో రెండెకరాలు సేకరించాల్సి ఉంది)
సర్వే నంబర్లు: 72/1/6, 72/1/3
అంచనా వ్యయం: రూ.69 కోట్లు

సాక్షి, ఆదిలాబాద్: నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం ముందడుగు పడింది. మావల మండలం బట్టిసావర్గాంలో ప్రభుత్వ భూమికి అదనంగా ఓ రెండెకరాల స్థల సేకరణ విషయంలో ఆది నుంచి వివాదం నెలకొంది. ఇద్దరు అసైన్డ్‌దారుల చేతిలో ఉన్న ఆ భూమి సేకరించిన పక్షంలో భవన నిర్మాణం పూర్తిగా వాస్తు ప్రకారం నిర్మించేందుకు అనువుగా ఉంటుందని ముందునుంచి భావిస్తున్నారు. అయితే ఆ రెండెకరాల సేకరణ అధికారులకు గుదిబండగా మారింది. తాజాగా నిర్వాసితులకు పరిహారం లేని పక్షంలో భూమి ఇస్తామని చెప్పగా వారు ఒప్పుకొన్నారు. మరో వైపు రోడ్లు, భవనాల శాఖ ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. ఇక పనులు ప్రారంభించడమే తరువాయి.

ఆది నుంచి చిక్కుముడి

జిల్లా కేంద్రానికి శివారులో ఉండే మావల మండలం బట్టిసావర్గాం గ్రామంలోని 72/1/6 సర్వే నంబర్లలో 17 ఎకరాలు ఉంది. దీన్ని ఆనుకునే 72/1/3 సర్వే నంబర్లలో తొమ్మిదెకరాలు, మొత్తంగా 26 ఎకరాలను సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిని గతేడాది హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి పరిశీలించారు. సమీకృత భవనానికి ఇన్, అవుట్ గేట్లు అనువుగా ఉండాలంటే 44వ జాతీయ రహదారి వైపు ఈ భూమిని ఆనుకొని ఉన్న మరో రెండెకరాలు సేకరించాలని నిర్ణయించారు. దీంతో వాస్తుకు అనువుగా ఉండడంతోపాటు ఒక వైపు నుంచి లోనికి వస్తే మరోవైపు నుంచి బయటకు పోయేందుకు సరిపోతుందని భావించారు. అలాగే హెలిప్యాడ్ నిర్మాణానికీ స్థలం కలిసి వస్తుందని నిర్ణయించారు. ఈ మేరకు ఇద్దరు అసైన్డ్‌దారుల చేతుల్లో ఉన్న ఆ భూమిని సేకరించి కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

అనుకున్నదొకటైతే..

అదనంగా సేకరించే ఆ రెండెకరాలు అసైన్డ్ భూమి అయినప్పటికీ హక్కుదారుల నుంచి సేకరించడం ఇబ్బందిగా మారింది. భూమికి బదులు భూమి ఇస్తామని, లేనిపక్షంలో పరిహారం ఇస్తామని అధికారులు అప్పట్లో వారిని సంప్రదించారు. వారు అంగీకరించడంతో ప్రభుత్వ నిర్ణయం కోసం పంపించారు. దీంతో నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులు ప్రారంభం కావడమే తరువాయి అనుకున్న తరుణంలో అసలు సమస్య మొదలైంది. అధికారుల ప్రతిపాదనకు అంగీకరించిన వారిలో ఓ హక్కుదారు తన చేతిలో ఉన్న ఎకరం భూమికి సంబంధించి పాత తేదీల్లో అక్రమంగా లేఅవుట్ సృష్టించాడు. అందులో ప్లాట్లను చేసి విక్రయించాడు. ఈ తతంగం అంతా జరిగిపోయింది. దీంతో భూసేకరణ ఎలా అనే సందిగ్ధం తలెత్తింది. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఇటీవలే ఆ భూమిని కూడా పరిశీలించారు. కాగా, భూయజమానులతో ఒప్పందం కుదిరిందని, వారు భూమి ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారని తాజాగా రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

హైదరాబాద్ కంపెనీకి నిర్మాణ బాధ్యతలు

కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.55 కోట్లు కేటాయించింది. వివిధ చిక్కుముడుల కారణంగా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. పనులు మొదలు కాలేదు. రోడ్లు భవనాల శాఖ భవన నిర్మాణం చేపట్టనుంది. అప్పట్లోనే ఈ నిధులు మంజూరైనప్పటికీ భూమి వివాదాలను రెవెన్యూ శాఖ పరిష్కరించలేకపోవడంతో వారు ఏమీ చేయలేని పరిస్థితి కనిపించింది. తాజా ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు భూ నిర్వాసితులతో రాజీ కుదరడంతో ముందడుగు పడింది. మరో వైపు ఆర్‌అండ్‌బీ టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. కాగా, అప్పుడు రూ.55 కోట్లు అంచనా వ్యయం ఉండగా, తాజాగా రూ.69 కోట్లకు పెంచారు. దీంట్లో భూ పరిహారం కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన చాబ్రా అసోసియేషన్ భవన నిర్మాణ పనులు దక్కించుకుంది. అగ్రిమెంట్ కావాల్సి ఉంది. ఆ తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి.

నిర్వాసితులతో రాజీ కుదిరింది



భూ నిర్వాసితులతో రాజీ కుదిరింది. రెండెకరాల విషయంలో వారితో ఒప్పందం జరిగింది. బట్టి సావర్గాంలో ఎకరానికి ప్రభుత్వ విలువ రూ.55 లక్షలుగా ఉంది. మార్కెట్ విలువకు అనుగుణంగా మూడింతల ఎక్కువ విలువ కట్టి ఇవ్వాల్సి ఉంది. లేని పక్షంలో భూమికి బదులు భూమి ఇస్తాం. ఆర్‌అండ్‌బీ టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది.

– రమేశ్ రాథోడ్, ఆర్డీవో, ఆదిలాబాద్

హరిత లక్ష్యం ఖరారు



తలమడుగు మండలం ఉండం గ్రామ నర్సరీలో నీళ్లు పడుతున్న సిబ్బంది

- 45లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం
- వివిధ శాఖల ఆధ్వర్యంలో నర్సరీలు
- మొక్కల పెంపకానికి కసరత్తు షురూ

ప్రధాన శాఖలకు కేటాయించిన లక్ష్యాలు

శాఖలు	మొక్కల లక్ష్యం
డీఆర్డీవో	25 లక్షలు
అటవీశాఖ	8 లక్షలు
మున్సిపల్‌శాఖ	5 లక్షలు
వ్యవసాయశాఖ	2 లక్షలు
ఐటీడీఏ	లక్ష
ఇతర శాఖలు	4లక్షలు

కైలాస్‌నగర్: జిల్లాలో తొమ్మిదో విడత హరితహారంలో నాటనున్న మొక్కల లక్ష్యాన్ని జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. 2023–24 సంవత్సరానికిగాను జిల్లా వ్యాప్తంగా 45లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించింది. డీఆర్డీవో, మున్సిపల్, అటవీశాఖల ఆధ్వర్యంలోని నర్సరీల్లో 50 లక్షల మొక్కలు పెంచేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటి నుంచే జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో అధికారులు నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి అవసరమైన కసరత్తు ప్రారంభించారు. జూన్ నాటికి మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నారు. అయితే వేసవి ప్రారంభమై ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మొక్కల సంరక్షణ ఆయా శాఖలకు సవాల్‌గా మారింది.

పెంపకం లక్ష్యం 50లక్షలు..

జిల్లాలో 45లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించిన అధికార యంత్రాంగం వాటి పెంపకం బాధ్యతలు మూడు శాఖలకు అప్పగించారు. డీఆర్డీవో, మున్సిపల్, అటవీశాఖల ద్వారా మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉపాధి నిధులతో జిల్లాలోని 468 గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల చెరువుల నుంచి మట్టి తీసుకువచ్చి పాలిథీన్ బ్యాగుల్లో నింపుతున్నారు. మరి కొన్నిచోట్ల మట్టి నింపి విత్తనాలు కూడా నాటారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 12 నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ఆ శాఖకు అవసరమైన 8లక్షల మొక్కలతో పాటు ఇతర శాఖలకు కూడా అందించేలా 16లక్షల మొక్కలను పెంచేదిశగా చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. ఇక ఆదిలాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ఐదు లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ఏడాది మున్సిపల్ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయకుండా మొక్కల పెంపకానికి సంబంధించిన నర్సరీల బాధ్యతలు జిల్లా జైళ్లశాఖ, ఎస్‌హెచ్‌జీలకు అప్పగించారు. వారి నుంచి ఆ ఐదు లక్షల మొక్కలు స్వీకరించి హరితహారానికి వినియోగించాలని నిర్ణయించారు.

సవాల్‌గా మొక్కల సంరక్షణ

నర్సరీల ఏర్పాటు బాగానే ఉన్నా మొక్కల సంరక్షణ ఈసారి నిర్వాహకులకు సవాల్‌గా మారనుంది. మొక్కల సంరక్షణకు ఉపయోగపడే గ్రీన్‌షెడ్ నెట్‌ల సరఫరాను ప్రభుత్వం రెండేళ్లగా నిలిపివేసింది. దీంతో వాటిని పంచాయతీలే కొనుగోలు చేయాల్సి వస్తోంది. నిధుల లేమితో ఇప్పటికే నానా తిప్పలు పడుతున్న పంచాయతీలు వాటి కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. కాగా, ఇప్పటికే ఎండల తీవ్రత మొదలైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్న నేపథ్యంలో గ్రీన్ నెట్‌లు లేని కారణంగా మొలిచిన మొక్కలు ఎండిపోయే ప్రమాదం లేకపోలేదు. పంచాయతీల గ్రీన్ బడ్జెట్ నుంచి వాటిని కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల లేమితో సర్పంచులు ఆసక్తి చూపడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మొక్కల సంరక్షణ ఏ మేరకు సాధ్యపడుతుందనేది ప్రశ్నార్థకమే.

శాఖలవారీగా ‘హరిత’ లక్ష్యం

హరితహారంలో భాగంగా 2023–24 సంవత్సరానికిగాను జిల్లా వ్యాప్తంగా 45లక్షల మొక్కలు నాటాలని అధికారులు నిర్ణయించారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ప్రధానంగా డీఆర్డీవో, అటవీ, మున్సిపల్ శాఖలకు లక్ష్యం నిర్దేశించిన ప్రభుత్వం మిగతా 26శాఖలకు లక్ష నుంచి రెండు వేల వరకు నాటేలా టార్గెట్ విధించింది. శాఖల వారీగా నాటాల్సిన లక్ష్యాలను కేటాయిస్తూ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు పంపించారు. వచ్చే జూన్‌లో లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాల్సి ఉంది.

ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 15వరకు జరుగుతుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ కల్నల్ కే దాస్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ జరిగిన ప్రతీసారి 30–40శాతం మంది యువకులు ఆదిలాబాద్ జిల్లా నుంచే ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఫిజికల్, మెడికల్ టెస్టుల కంటే ముందే హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఏర్పాటు చేసే కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్నల్ కే దాస్ మాట్లాడుతూ.. ఆసక్తి గల అభ్యర్థులు టెన్త్ మెమో, ఆధార్‌కార్డు వివరాలతో www.joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు రూ.500తో దరఖాస్తు చేసుకుంటే తిరిగి రూ.250 చెల్లించనున్నట్లు తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు చేసిన అభ్యర్థులకు 50మార్కులు బోనస్‌గా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7996157222 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అసిస్టెంట్ రిక్రూటింగ్ ఆఫీసర్ మేజర్ శివజీలాల్, లైజన్ అధికారి వీవీ నాయుడు పాల్గొన్నారు.

5న గురుకుల సీవోఈ సెట్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సీవోఈ సెట్‌ను ఈ నెల 5న నిర్వహించనున్నట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీవో కె.స్వరూపారాణి తెలిపారు. గురువారం బెల్లంపల్లి సీవోఈ కళాశాలకు వచ్చిన ఆమె వివరాలు వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సీఓఈ సెట్ నిర్వహణ కోసం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో సీఓఈలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 6,719 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి పలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

కైలాస్‌నగర్: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్‌భాషాషేక్ సూచించారు. గురువారం పట్టణంలోని డైట్ కళాశాల ఆవరణలో గల భవిత విలీన విద్యావనరుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు దూరంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వారికి పౌష్టికాహారం అందించాలని కోరగా, శుక్రవారం నుంచి రాగి జావ అందించేలా చూడాలని అక్కడే ఉన్న డీఈవో ప్రణీతను ఆదేశించారు. దివ్యాంగులు కూడా సవ్యాంగులతో సమానంగా రాణించేలా విద్యాబుద్ధులు నేర్పించాలని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్వో నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ శైలజ, డైట్ వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, భవిత కేంద్రం టీచర్స్ పుష్పవేణి, బీ నరేశ్, ఎం.భవన తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలను వంచించిన బీఆర్‌ఎస్’



ప్రజలకు వివరిస్తున్న సుజాత, సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌అర్బన్: ప్రతీ పేదవాడికి డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని బీఆర్‌ఎస్ విస్మరించి ప్రజలను మోసం చేసిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా టీపీసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాతతో కలిసి గురువారం పట్టణంలోని దుర్గానగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల పట్టాలు మినహా బీఆర్‌ఎస్ చేసిందేమీలేదని విమర్శించారు. మళ్లీ వంటగ్యాస్ ధర రూ.50 పెంచిన కేంద్ర ప్రభుత్వం మహిళా దినోత్సవానికి ముందే మహిళలతో కంటతడి పెట్టిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, పట్టణాధ్యక్షుడు నగేశ్, నాయకులు అనంతరావు, సంతోష్, శివాజీ, ఫయాం, రఘువంశీ, కవిత, గంగమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిజ్వాన్ భాషాషేక్

కైలాస్‌నగర్: 3, 5 తరగతుల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఈ నెల 16న నిర్వహించే తుది పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషాషేక్ సూచించారు. పరీక్షల నిర్వహణపై గురువారం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ–టాస్ పరీక్షను విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని క్షేత్ర స్థాయిలో పరీక్షను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సెక్టోరల్ అధికారి కంటే నర్సయ్య, రిసోర్స్ పర్సన్ పోరెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమించిన పిప్పల్‌కోటి రైతులు

- ఎకరాకు రూ.8లక్షల చొప్పున పరిహారం చెల్లింపునకు అధికారుల హామీ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేంద్రనాథ్

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి వద్ద చేపట్టిన పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో సాగు భూములు కోల్పోతున్న రైతులు 16 రోజులుగా పరిహారం కోసం ఆందోళన చేపట్టారు. రిజర్వాయర్ నిర్మాణ స్థలం వద్ద రిలే దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఎట్టకేలకు కలెక్టర్ జోక్యంతో గురువారం రైతులు రిలేదీక్ష విరమించారు. రైతు ప్రతినిధులతో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేకంగా చర్చలు జరిపారు. గతంలో ప్రకటించినట్లు ఎకరాకు రూ.8లక్షల చొప్పున పరిహారం అందేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు భీంపూర్ తహసీల్దార్ మహేంద్రనాథ్ రిలే దీక్ష స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. గతంలో ప్రకటించినట్లుగా ప్రభుత్వం 837 ఎకరాలకు రూ.8లక్షల చొప్పున పరిహారం త్వరలో నిర్వాసితులకు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రిలే దీక్ష విరమించారు. 45 రోజుల్లో పరిహారం తమ బ్యాంక్ ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోకుంటే మళ్లీ రిలేదీక్ష చేపడతామని రైతులు హెచ్చరించారు. ఈ సందర్భంగా రైతులు తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, ఆర్ఐ అశోక్, రైతులు స్వామి, నర్సింగ్, నసీరొద్దీన్, అశోక్, మల్లికార్జున్ తదితరులున్నారు.

రాష్ట్రంలోనూ బీజేపీదే అధికారం

- జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్
- ఈశాన్య రాష్ట్రాల్లో గెలుపుపై సంబరాలు



పటాకులు కాలుస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ అధికారంలోకి వచ్చినట్లే రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ధీమా వ్యక్తంజేశారు. త్రిపుర, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద గురువారం నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. పటాకులు కాల్చి పరస్పరం మిఠాయి తినిపించుకున్నారు. అనంతరం పాయల్ శంకర్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విమర్శలను ప్రజలు తిప్పి కొడుతున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు బీజేపీకి పట్టం కడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని, ఈ దిశగా కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినీరెడ్డి, నాయకులు జోగు రవి, దినేశ్ మటోలియా, విజయ్‌బోయర్, భీంసేన్‌రెడ్డి, లాలమున్న, లోక ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘డెప్యుటేషన్లతో అదనపు ఆదాయం రాలేదు’

సాక్షి, ఆదిలాబాద్: భోరజ్ చెక్‌పోస్టులో డెప్యూటేషన్ల ద్వారా నియమితులైన అదనపు సిబ్బందితో ప్రభుత్వానికి అదనపు ఆదాయం రాలేదని ఉద్యోగ, ఉపాధ్యాయ గజిటెడ్ అధికారుల టీజేఏసీ ఆదిలాబాద్ చైర్మన్ ఎస్.అశోక్, కార్యదర్శి అజ్మీరా శ్యామ్‌నాయక్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఇక్కడున్న అదనపు సిబ్బందిని వారి రెగ్యులర్ స్థానాలకు పంపాలని కోరారు. ఈ చెక్‌పోస్టులో ఎంవీఐ, ఏఎంవీఐలు 12 మంది రెగ్యులర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా మరో 13 మంది ఆన్‌డ్యూటీ, పూర్తి అదనపు చార్జ్‌లతో విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ఈ అదనపు సిబ్బందితో రెగ్యులర్ ఉద్యోగుల డ్యూటీలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో మార్పు లేకపోవడం, రెగ్యులర్ ఉద్యోగుల డ్యూటీలపై ప్రభావం కారణంగా ప్రభుత్వ డెప్యూటేషన్ల లక్ష్యం నీరుగారిపోతుందని విన్నవించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు సిబ్బందిని వారి రెగ్యులర్ స్థానాలకు పంపించాలని ఈ సందర్భంగా శ్యామ్‌నాయక్ కోరారు.

క్లుప్తంగా

ఆదిలాబాద్‌లో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం


జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.ఉమా మహేశ్వర్ తెలిపారు. దీని ద్వారా విదేశాలకు పార్శిల్స్ పంపుకోవచ్చని వివరించారు. రాష్ట్రంలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలకు ఇది మంజూరు కాగా అందులో ఆదిలాబాద్ ఒకటని పేర్కొన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యంతర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఈ కేంద్రం ద్వారా ఎంతో సులభంగా విదేశాలకు పంపుకోవచ్చని వివరించారు. https://dnk.cept.gov.in/customers.web/ కు కస్టమర్ లాగిన్ అయి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆదిలాబాద్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం పోస్టు మాస్టర్ కె.ఉత్తంను సెల్:7382070807లో సంప్రదించాలన్నారు.

పలువురిపై కేసు నమోదు

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో డబుల్‌బెడ్‌రూం కోసం గురువారం లక్కీ డ్రా నిర్వహించారు. లక్కీ డ్రాను అడ్డుకుని ఎమ్మెల్యే రేఖానాయక్ భర్త శ్యాంనాయక్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ పలువురు రోడ్డుపై బైఠాయించారు. ఇందులో బీజేపీ పార్టీ నాయకులు భూక్యా జానుబాయి, పడాల రాజశేఖర్, తోకల బుచ్చన్న, అజ్మీరా హరినాయక్, జక్కుల గంగామణిలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

కలప నిందితుల బైండోవర్


తహసీల్దార్ ఎదుట నిందితుడు

కడెం: కలప స్మగ్లింగ్‌లో ప్రధాన నిందితుడైన మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మెడిశెట్టి మహేశ్‌ను అటవీశాఖ అధికారులు గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. మహేశ్ ఇటీవల కాలంలో రెండు కార్లలో అక్రమంగా కలపను తరలిస్తూ పట్టుబడ్డాడు. కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో అనిత హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థ, ఎఫ్‌బీవో ఆలీం ఉన్నారు.

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి నాలుగో తరగతి చదువుతున్న గిరిజనేతర విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ, గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న శనివారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.



స్వేచ్ఛగా బతుకనిద్దాం

అమాయక జీవులు జీవ వైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు గల జంతువులు.. ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు. వాటికి కేటాయించిన స్థలంలో ఉండనిద్దాం. వాటి రక్షణకు బాధ్యతగా పాటుపడుదాం. జీవ వైవిధ్యంలో ఏ ఒక్క వన్యప్రాణి అంతరించిపోయినా అనర్థాలు కలుగుతాయి. అందుకే అడవితల్లి ఒడిలో సేద తీరే వన్యప్రాణులను స్వేచ్ఛగా బతుకనిద్దాం. నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు
- సకల జీవరాశితోనే జీవవైవిధ్యం
- అంతరిస్తే ప్రకృతిపై ప్రభావం
- నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం


చుక్కల దుప్పులు

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని వివిధ అటవీ డివిజన్లలో రకరకాల వన్యప్రాణులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, సాంబర్లు, కొండగొర్లు, కృష్ణజింకలు, అడవిపందులు, కుందేళ్లు, అడవిదున్నలు లాంటి శాఖ జంతువులు, అడవికుక్కలు, చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్ల వంటి మాంసాహార జంతువులు ఉంటున్నాయి. జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణుల ఆవాసాలకు చిరునామాగా ఉంది. ప్రకృతి ఒడిలో అలరాడే అమాయక జీవులు వన్యప్రాణులు. వాటి సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొందరు తమస్వార్థం కోసం వాటిని హతమారుస్తున్నారు. జీవ వైవిధ్యంలో ఒక జంతువుపై మరో జంతువు ఆధారపడుతుంది. వన్యప్రాణులు అంతరించిపోతే ప్రకృతిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

వేట నివారణకు ప్రత్యేక నిఘా

అడవిలో ఉంటూ స్వేచ్ఛగా జీవిస్తున్న వన్యప్రాణులపై వేటగాళ్లు పంజా విసురుతున్నారు. వాటిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వేట నిర్మూలనకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణులను వేటాడిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అంతేకాకుండా వేటాడితే ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయి...శిక్షలు, అనర్థాలపై అటవీశాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాజాత బృందం సభ్యులతో వన్యప్రాణుల రక్షణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మూడేళ్లుగా వేట తగ్గినట్లు కనిపిస్తోంది.

రాబోయే తరాలకు చూపిద్దాం

వన్యప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకుని రాబోయే తరాలకు వాటిని చిత్రాలలో కాకుండా నేరుగా చూసే అవకాశం కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉంది. వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకుందాం. అమాయకపు చుక్కల దుప్పులు, చెంగుచెంగున ఎగిరే కొండగొర్రెల అందాలను అంతరించిపోకుండా కాపాడుకుందాం.

గడ్డి క్షేత్రాలు, నీటి వసతులు

వన్యప్రాణుల కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టైగర్‌జోన్‌లోకి పులి ప్రవేశిస్తే సరిపడా ఆహారం అందించేందుకు రకరకాల వణ్యప్రాణుల సంతతి పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లో ఎఫ్‌డీవో మాధవరావు చొరవతో 500 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను పెంచారు. వాటికి నీటి సౌకర్యం కల్పించేందుకు 300ల నీటి కుంటలు నిర్మించారు. 20 చోట్ల సోలార్ నీటి పంపులతో కుంటలకు నీటిని వదులుతున్నారు. దీంతో వన్యప్రాణులు ఆహారం, నీరు, ఆవాసాలుగా ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. దీంతోపాటు మూడేళ్లుగా గ్రామాల్లోని పశువులు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పశువులు అడవిలోకి వెళ్తే వాటి అలజడికి వన్యప్రాణులు భయంతో పారిపోయే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు పశువుల మేతకు ప్రత్యేక స్థలం కేటాయించారు. కోర్ ఏరియాలోకి పశువులు, ప్రజలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా రెండేళ్లలో వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయ్యింది.

బాధ్యతగా తీసుకోవాలి



వన్యప్రాణులు అంతరిస్తే అనర్థాలు కలుగుతాయి. ప్రకృతిలో భాగమైన వన్యప్రాణుల రక్షణ అటవీ అధికారులే కాకుండా అందరూ బాధ్యతగా తీసుకుంటే రాబోయే తరాలకు వాటి గురించి తెలుస్తుంది. అవి స్వేచ్ఛగా జీవించేందుకు సహకరించాలి. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాటికి సరిపడా ఆహారం, నీరు, ఆవాసం ఏర్పాటు చేస్తున్నాం.

– సిరిపురం మాధవరావు , డెప్యూటీ కన్జర్వేటర్

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


చెన్నూర్‌లో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా దండేపల్లిలో గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు సాగునీరందించాలని ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నాయకులు కుర్మ మల్లాగౌడ్, ముత్యాల బాపాగౌడ్, మహేశ్‌ప్రసాద్ తివారి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల బైండోవర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలో 40మంది కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి తహసీల్దార్ రాజేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రాజు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టు

లక్సెట్టిపేట: రైతులకు మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ తెలిపారు. అరెస్టయిన వారిలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, మండల అధ్యక్షుడు పింగళి రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, ఎస్సీ సెల్ సెక్రటరీ గుత్తికొండ శ్రీధర్, మాజీ ఎంపీటీసీ మడిపల్లి స్వామి, నాయకులు సూరం చంద్రమౌళి, రాందేని చిన్న వెంకటేశ్, బోడ రాజు, కోల నాగు, ప్రశాంత్, హాజీ, అగ్గు లింగన్న, మూల కిషన్‌గౌడ్, పెరుగు తిరుపతి, తోట చంద్రశేఖర్, అమీర్‌ఖాన్, శాఖాన్, రవి, నరసింహాచారి, అయూబ్‌ఖాన్, కాంతన్న, కాండ్ర ప్రసాద్, పెట్టం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

- జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్


పట్టుకున్న ట్రాక్టర్లతో జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్, ఆర్ఐ, ఎస్సైలు

బేల: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోగ్దూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దీంతో పాటు అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌గంగలో సరిపడా ఇసుక లేదని, ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతుల్లేవని పేర్కొన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించి, అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ ఆనంద్‌కుమార్, ఎస్సై కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీ పతనమే

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్


సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో కేంద్రం బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీ పతనం కాక తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ ఆరోపించారు. వర్గీకరణపై కేంద్రం తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నుంచి ఆ సంఘం ఆధ్వర్యంలో మాదిగల సంగ్రామ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాకు మించి ఎస్సీ రిజర్వేషన్లను ఏకపక్షంగా దోచుకుంటున్న కులాలకు బీజేపీ తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీకి మాదిగలు దూరం కానున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీజేపీ ప్రభుత్వం మెడలు వంచేలా, మాదిగ సమాజాన్ని మరో యుద్ధానికి సిద్ధం చేయడం కోసమే ఈ మాదిగల సంగ్రామ పాదయాత్ర చేపట్టామన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ యాత్ర ద్వారా ప్రజలను చైతన్యం చేసి లక్షలాది మందితో ఏప్రిల్ 4న హైదరాబాద్‌ను ముట్టడిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ నాయకులు కుడాల స్వామి, కాంబ్లీ బాలాజీ, జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్, చిట్టి రవి, అడ్డిగ స్వామి, అరేపల్లి రాజేశ్ పాల్గొన్నారు.

‘108’కు జీపీఆర్ఎస్

- మెరుగైన వైద్యసేవలపై ప్రభుత్వం దృష్టి
- 108కి సాంకేతిక పరిజ్ఞానం
- ఆలస్యానికి చెక్ పెట్టేందుకు..



చెన్నూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవల కోసం 108 సర్వీసులు పనిచేస్తున్నాయి. మరింత వేగంగా సంఘటనా స్థలాలకు వాహనాలు చేరుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రానున్న రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొత్తం 52 వాహనాలకు జీపీఆర్ఎస్ సిస్టమ్ అనుసంధానం చేయనున్నారు.

ఆలస్యానికి చెక్...

ప్రమాదాలు జరిగితే ముందుగా గుర్తుకొచ్చేది 108 వాహనమే. అత్యవసర సేవలకు ప్రమాదం జరిగిన వెంటనే 108కు ఫోన్ చేస్తుంటారు. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్సలు అందించి సమీప ఆస్పత్రులకు తరలిస్తారు. ఈ మధ్య కాలంలో వివిధ కారణాలతో వాహనం అలస్యమవుతోంది. వాహన ఆలస్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది. వాహనాలలో జీపీఆర్ఎస్ సిస్టమ్‌ను అనుసంధానం చేయడంతో వాహనం ఎక్కడ ఉందో కాలర్‌కు తెలిసిపోనుంది.

వాహనాలకు 5జీ సిమ్‌లు..

ఇప్పటి వరకు వాహనాలలో 2జీ సిమ్‌లు మాత్రమే ఉన్నాయి. దీంతో సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. సిగ్నల్ సమస్యను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాహనాల్లో ఉపయోగించనున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో వాహనాలను అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను వెంటనే ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేందుకు ఈ విధానం దోహదపడనుంది. రానున్న రెండు మూడు రోజులలో ఈ విధానం అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

కాలర్‌కు వాహన లోకేషన్..

ప్రమాదం జరిగిన వెంటనే కాల్ చేస్తే హైదరాబాద్ కాల్ సెంటర్ నుంచి సంబంధిత 108 వాహనానికి వివరాలు పంపిస్తారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంటారు. ఇందు కోసం వాహనాలకు ఆధునాతన ఫోన్‌లను ఇవ్వనున్నారు. ఎవరి ఫోన్ నుంచి కాల్ వస్తుందో వారికి లింక్ పంపిస్తారు. లింక్‌ను ఓపెన్ చేస్తే వాహనం ఎక్కడ ఉంది, వచ్చేందుకు ఎంత సమయం పట్టనుందనే సమాచారం తెలిసిపోనుంది. ఈ విధానం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు తెలిసింది. వాహనల ట్రాకింగ్ విధానంతో వాహనాలు ఏ ప్రాంతాలకు వెళ్తున్నాయో కాల్ సెంటర్ నిర్వాహకులకు తెలియనుంది.

అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

- టీవీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్
- తెలంగాణ బచావో పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కేసీఆర్ ఒకరితోనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని టీవీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ అన్నారు. మార్చి 10న హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ‘తెలంగాణ బచావో’ సదస్సు పోస్టర్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలో టీవీజేఎస్ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల వీరోచిత పోరాటం, ఆత్మబలిదానాలు, ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ సకల జనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం మరచిపోయిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన 1200 మంది అమరవీరుల కుటుంబాలను ఆదుకోకుండా 500 మందిని గుర్తించి మిగతా వారిని నిర్లక్ష్యం చేశాడన్నారు. మిగిలిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాటి ఉద్యమ ఆకాంక్షలు మరచిన కేసీఆర్ ప్రభుత్వం మీద పోరాటానికి తెలంగాణ ఉద్యమకారులు పార్టీ జెండాలను పక్కన పెట్టి ఏకమై తెలంగాణను కేసీఆర్ కబంధ హస్తాల నుంచి కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రమేష్ కుమార్, మహిపాల్, సాయి, సాయిరాం, కృష్ణ, నరేష్, రమణ, శంకర్, విక్రమ్, సూర్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

ఉసురు తీసిన అప్పులు

- పురుగుల మందుతాగి రైతు బలవన్మరణం
- ఖరీఫ్‌లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తిపంట


చవాన్ రమేశ్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం... మండలంలోని హస్నాపూర్‌కు చెందిన చవాన్ రమేశ్(55) తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఖరీఫ్‌లో పత్తి పంట సాగుచేశాడు. పంట సాగు కోసం రూ.5లక్షల వరకు ప్రైవేటుగా అప్పులు చేశాడు. అయితే అకాల వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై బుధవారం పంట పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు సమాఖ్యను సందర్శించిన మహారాష్ట్ర అధికారులు


వివరాలు తెలుసుకుంటున్న సంక్షేమ అధికారులు

ఉట్నూర్‌రూరల్: ప్రజామిత్ర రైతు సమాఖ్యను మహా రాష్ట్ర గిరిజన సంక్షేమ అధికారులు గురువారం సందర్శించారు. దాల్‌మిల్ ఏర్పాటు చేసిన విధానాన్ని తెలుసుకున్నారు. దాల్‌మిల్లును మహారాష్ట్రలో కూడా ఏర్పాటు చేసి సీసీడీ స్వచ్ఛంద సంస్థతో ప్రజామిత్ర లాగా ముందుకు నడిపించాలని కోరారు. ఈ విధానాన్ని శబరి ఆదివాసీ మహా మండల్ నాసిక్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ బ్రహ్మణ్‌వారి అభినందించారు. ఇందులో యవత్‌మాల్ జిల్లా శబరిమల మండల్ అధికారి ఆడావత్కర్ నిలేశ్, కేంద్రి సీసీడీ ప్రాజెక్టు మేనేజర్ విఠల్‌రావు, సీసీడీ అకౌంట్స్ మేనేజర్ రఘు, ప్రజా మిత్ర అధ్యక్షుడు మెస్రం బాదిరావు, గణపతి, జుగాదిరావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, ప్రశాంత్, అస్లాం, శివ పాల్గొన్నారు.

న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో బుధవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుడు గణేశ్ కథనం ప్రకారం.. గణేశ్ మంచిర్యాల జిల్లాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇదే క్రమంలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులందరూ మంచిర్యాలకు వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి గోడ పైనుంచి దూకి తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని 15 తులాల వెండి, ఒక గ్రాము బంగారం ఎత్తుకెళ్లారు. గురువారం గమనించిన ఇంటి చుట్టుపక్కల వారు సమాచారం ఇవ్వడంతో బాధితుడు ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆటోను ఢీకొట్టిన లారీ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ సమీపంలో గురువారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌కు చెందిన హర్షత్ ఆటోను తీసుకుని వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన డేవిడ్(10)పై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. సుమారు ఐదు కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన బాలుడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పట్టణంలో పెరిగిపోతున్న కుక్కల బెడదను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్జీయూకేటీలో విద్యార్థులపై కుక్కల దాడి

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులపై కుక్కలు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం సాయంత్రం క్యాంపస్ ఆవరణలో ఇద్దరు విద్యార్థులపై కుక్కలు దాడి చేయడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో క్యాంపస్‌లోని ఆరోగ్యకేంద్రంలో వారికి చికిత్స అందించారు.

ఖానాపూర్‌ను వీడని ట్రాఫిక్ తిప్పలు


బస్సు-కారు ఢీకొన్న ప్రాంతంలో గుమిగూడిన జనం

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడింగ్ పనుల్లో జాప్యంతో ప్రతీ రోజు ప్రజలకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. దీంతో ప్రతి రోజు ఏదో ఓ చోట రోడ్డు ప్రమాదం జరగడం సర్వసాధారణమైంది. 10 రోజుల క్రితం స్థానిక జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఓ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగిపోయింది. తాజాగా గురువారం సైతం అదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు-కారు ఢీకొనగా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది. దీంతో అక్కడికి చేరుకున్న స్థానికులు ఇరువురిని సముదాయించే క్రమంలో ఆందోళన నెలకొంది. ఈ రోడ్డు ప్రమాదంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు.